

## ప్రచార ఆర్భాటం..మెగా పీటీఎం

చిత్తూరు జిల్లాలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం ప్రచార ఆర్భాటంగా కనిపిస్తుందని విద్యావేత్తలు అన్నారు. - 8లో



## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సూచించారు. - 8లో



## ఆగని గజదాడులు

పులిచర్ల మండలంలో గజదాడులు ఆగడం లేదు. రోజుకో చోట పంటలపై దాడులు చేసి, ధ్వంసం చేస్తున్నాయి. - 8లో

## న్యూస్‌రీల్

### బంగారు విభూది పట్టి విరాళం



విభూది పట్టిని అందజేస్తున్న దాతలు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామివారికి గురువారం యూఎస్‌ఏకు చెందిన చంద్రశేఖర్ తన కుటుంబ సభ్యులతో కలిసి రూ.14 లక్షలు విలువ చేసే 140 గ్రాముల బంగారు విభూది పట్టిని స్వామివారికి విరాళంగా ఇచ్చారు. దాతలు ఈ పట్టిని ఈఓ పెంచల కిషోర్‌కు అందజేశారు. అనంతరం వారికి ఆలయాధికారులు ఆలయ మర్యాదలు చేసి, స్వామివారి దర్శనం కల్పించారు.

### విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

యాదమరి: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం ఆమె కోనాపల్లిలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ మన పిల్లలు చదువుకుంటున్న పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రులు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. ఎంఈఓ రుక్మిణి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిత చేకూరుతుందన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కొట్టాలం ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు యూసఫ్ తల్లిదండ్రులతో పాఠశాల అభివృద్ధి, బోధన, ఇతర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ పార్థసారథి, ఎంఈఓ-2 ప్రసాద్, ఉపాధ్యాయులు వెంకటరమణ పాల్గొన్నారు.

## రైతులను దండుపాళెం బ్యాచ్‌గా చిత్రీకరణపై ఆగ్రహం

- విలువలు పాటించకుండా కర్షకులపై వ్యతిరేక కథనాలు
- కూటమి సర్కార్‌కు తొత్తుగా మారిన పచ్చమీడియా
- మండిపడుతున్న అన్నదాతలు



# పుడమి పుత్రుడిపై పచ్చపాతమా?

పది మందికి పట్టెడన్నం పెట్టేవాడు పుడమి పుత్రుడు. అలాంటి మట్టి మనిషి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయాడు. మామిడి కొనేవారు లేక.. అమ్ముకోలేక.. పంట దిగుబడి ఏమి చేయాలో దిక్కుతోచక.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే దారిలేక.. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలో తెలియక.. నెలరోజులుగా మగ్గిపోతున్నాడు కర్షకుడు. ఆ పరిస్థితిని తెలుసుకున్న ప్రతిపక్ష నేత అన్నదాతల కష్టాలు విని, వారిని ఓదార్చి, వారికి అండగా నిలవాలని బంగారుపాళెంలో పర్యటించారు. ఆ పర్యటనను పచ్చ మీడియా బంగారుపాళెంలో దండుపాళెం అంటూ వక్రీకరిస్తూ కథనాలు ప్రచురించింది. దీనిపై రైతులు మండిపడుతున్నారు. దేశానికి వెన్నెముఖ అయిన అన్నదాతలు.. ఆ పచ్చమీడియాకు హత్యలు, చోరీలు, దోపీడీలు చేసే దొంగల్లా కనిపిస్తున్నారా?.. ఏమిటీ రాతలు.. కర్షకులపై ఎందుకంత కడుపుమంట అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇది సమంజసం కాదు.. మంచి పద్ధతి అంతకన్నా కాదు. ఇది వారికి శ్రేయస్సు కాదని హితవు పలుకుతున్నారు.

– తిరుపతి అర్బన్

### రైతులను అవమానించడం దారుణం



బంగారుపాళెం సమావేశానికి వెళ్లిన వారు రైతులు కాదు.. దండుపాళెం బ్యాచ్ అంటూ ఓ పత్రికలో వార్త చూశా. ఓ రైతుగా మనసులో చాలా బాధేసింది. పదిమందికి అన్నం పెట్టే రైతులంటే అందరికీ చులకన అయినట్టుంది. అన్నీ తెలిసి, బాగా చదువుకున్న వారే ఇలాంటి రాతలు రాయడం మంచిది కాదు. ఆ స్థానంలో మామిడి రైతే కాదు ఏ రైతున్నా ఒక్కటే కదా? ఎవరిపైనో కోపాన్ని రైతులపై చూపడం భావ్యం కాదు.

– గోవిందురెడ్డి, రైతు, బేరుపల్లి

### రైతు బాధలు తెలిసినోళ్లు అలా రాయరు



పంటకు ధర లేక, సాగుకు పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారు. మామిడికాయలను కొనేవారు లేక చెట్లలో మాగి రాలుతుంటే రైతుల అండగా నిలిచేందుకు జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం వచ్చారు. ఈ కార్యక్రమానికి రైతులు వెళ్లారు. కానీ ఓ పత్రికలో అక్కడికి వచ్చిన వారు రైతులు కాదు.. దండుపాళెం బ్యాచ్ అని రాయడం చాలా బాధాకరం. ఓ మాట రాసేముందు ఆలోచించుకోవాలి. ఈ రాతలతో రైతుల మనోభావాలు దెబ్బతిన్నాయి.

– రెడ్డెప్పరెడ్డి, రైతు, టీఎస్ అగ్రహారం

### ప్రతి పక్షనేత వచ్చాక కేంద్రానికి లేఖ ఏమిటో?



మామిడికి నెలరోజులుగా గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వారిని ప్రతిపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించిన తరువాత వ్యవసాయశాఖ మంత్రి అచ్చన్నాయుడు కేంద్రానికి లేఖ రాయడం ఏమిటో తెలియడం లేదు. ఓ పత్రికలో రైతులను దండుపాళెం బ్యాచ్‌గా చిత్రీకరించడం సరికాదు. వారి కష్టాలను ఆ పత్రికలు గుర్తించాల్సి ఉంది. వారికి అండగా ఉండాలే తప్ప, వారికి వ్యతిరేకంగా కథనాలు రాయడం మంచిది కాదు.

– అత్తిరాల సురేష్, రైతు, అంజూరు, కేవీబీపురం మండలం

### సర్కార్‌కు రైతులంటే చులకన



కూటమి సర్కార్‌కు రైతులంటే చులకనగా ఉంది. దాంతోనే వారి సమస్యలను అసలు పట్టించుకోవడం లేదు. చంద్రబాబు గతంలో వ్యవసాయం దండగా అన్న మహానుభావుడు. ఈ నేపథ్యంలోనే గిట్టుబాటు ధరలు లేక మామిడి రైతులు ఇబ్బందులు పడుతున్నా, వారిని పట్టించుకోవడం లేదు. ప్రతిపక్ష నేత కర్షకులను పరామర్శించడం ఎంతో నేరంగా భావిస్తున్నారు. దానికితోడు చంద్రబాబుకు అనుకూలంగా ఉన్న మీడియా రైతులను దండుపాళెం బ్యాచ్‌గా చిత్రీకరిస్తూ కథనాలు రాయడం మరింత దారుణంగా భావిస్తున్నాం. పత్రికలు ప్రజల పక్షాన పనిచేయాల్సి ఉందే తప్ప.. కూటమి సర్కార్ వైపు కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోరుతున్నాం.

– బాలయ్య, రైతు, వాకాడు మండలం

### అది మంచి పద్ధతి కాదు



చంద్రబాబుకు అనుకూలంగా ఉన్న పత్రికలో దండుపాళ్యెం బ్యాచ్ దాడులంటూ రైతులకు వ్యతిరేకంగా కథనాలు రాయడాన్ని తప్పుపడుతున్నాం. పత్రికలంటే ఎంతో గౌరవం ఉంది. ఒక వేళ రాజకీయంగా మీకు అనుకూలంగా ఉన్న నాయకుడిపై మంచి కథనాలు రాసినా ఎవరూ పెద్దగా పట్టించుకోరు. అయితే రైతులకు వ్యతిరేకంగా దండుపాళ్యెం బ్యాచ్ అంటూ కథనం ఇవ్వడం ఏ మాత్రం మంచి పద్ధతి కాదు.

– సుబ్రమణ్యం, రైతు, జంగాలపల్లి, వెంకటగిరి రూరల్ మండలం

### మంచి చెడులతో సంబంధం లేదు



చంద్రబాబుకు అనుకూలంగా ఉన్న పత్రికలకు మంచి చెడులతో సంబంధం లేదు. రైతులు, పేదోడు అనే భావన లేదు. ఒకటే మార్గం చంద్రబాబు ఏమీ చేసినా అదే కరెక్ట్‌గా భావిస్తున్నారు. ఆయనపై ఒక కథనం చెడుగా ఇప్పటి వరకు ఆ పత్రికల్లో రాలేదు. అంటే సీఎం చంద్రబాబు వంద శాతం మంచే చేస్తున్నారా? ప్రతి పక్షనేతపై ఒక్క మంచి కథనం ఇప్పటివరకు ఇవ్వలేదు. చివరికి దండుపాళ్యెం బ్యాచ్ అంటూ రైతులకు వ్యతిరేకంగా కథనాలు ఇవ్వడం ఎంత వరకు న్యాయమో తెలియడం లేదు.

– గుర్రం నాగిరెడ్డి, రైతు, ఆర్‌సీ పురం

### దండుపాళెం బ్యాచ్‌తో పోల్చడం ఎంటీ ?



రైతులను ఎల్లో మీడియా దండుపాళెం బ్యాచ్‌తో పోల్చడం ఏమిటో తెలియడం లేదు. ఎంతో దారుణంగా కథనాలు రాస్తున్నారు. చంద్రబాబును బతికించడానికే ఆ పత్రికలు పనిచేస్తున్నాయి. మామిడి రైతులు కష్టాల్లో ఉంటే వారిని పరామర్శించడానికి వచ్చిన వారిపై విషాన్ని చిమ్మడం ఎందుకో అర్థం కావడం లేదు. పత్రిక విలువలు పూర్తిగా దిగజార్చి కథనాలు రాస్తున్నాయి. రైతులకు వ్యతిరేకంగా వార్తలు రాయడం మరింత దారుణంగా భావిస్తున్నాం.

– తిరుమల రెడ్డి, రైతు, కారూరు, సూళ్లూరుపేట నియోజకవర్గం

### ఎంతవరకు న్యాయమో వారికే తెలియాలి



బీజేపీ కూటమి సర్కార్‌లో భాగమైనప్పుడు, టీడీపీకి చెందిన ఇద్దరు ఎంపీలు కేంద్రంలో మంత్రులుగా ఉన్నారు. వారుతో కేంద్రంతో మాట్లాడి ప్రత్యేక నిధులు తెచ్చి, మామిడి రైతులను ఆదుకోవాల్సి ఉంది. అంతే తప్ప వ్యవసాయశాఖా మంత్రిని కేంద్రానికి లేఖ రాయమని చెప్పడం విడ్డూరంగా ఉంది. మరోవైపు పచ్చపత్రికలు రైతులకు వ్యతిరేకంగా దండుపాళెం బ్యాచ్ దాడులు అంటూ కథనాలు రాయడం ఎంత వరకు న్యాయమో వారికే తెలియాల్సి ఉంది.

– అశోక్, రైతు, వరదయ్యపాళెం

### పత్రికలు రైతుల పక్షాన నిలబడాలి



ఏ పత్రిక అయినా ప్రభుత్వం వైపు కాకుండా ప్రజల పక్షాన పనిచేయాల్సి ఉంది. ప్రధానంగా అన్నం పెట్టే రైతు దేశానికే వెన్నుముకలాంటి వాడు. ఈ క్రమంలో రైతులకు అండగా ఉండాలే తప్ప చంద్రబాబుకు అండగా ఉంటూ రైతులను దండుపాళ్యెం బ్యాచ్‌గా చిత్రీకరించడం సరికాదు. ప్రజలు అన్నీ విషయాలను గమనిస్తున్నారు. సరైన సమయంలో చక్కటి బుద్ధి చెప్పడం ఖాయం.

– వేణునాయుడు, రైతు, కమ్మపల్లి, దక్కిలి మండలం

# ఎన్నికల అనంతరం టీడీపీ ఉనికి ప్రశ్నార్థకం



క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకర రెడ్డి

సదుం: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని, తరువాత టీడీపీ ఉనికి ప్రశ్నార్థకమని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో వైఎస్సార్ సీపీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కరుణాకరరెడ్డితో కలసి గురువారం బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరకాలంగా చంద్రబాబు ప్రజా సంక్షేమ కార్యక్రమాలను గాలికొదిలేసి, ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కోసం కష్టపడుతున్నవారిని వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకనే నిస్సిగ్గుగా అమలు చేస్తున్నట్లు ప్రకటించడం ఆయనకే చెల్లిందన్నారు. ఇలాంటి ప్రభుత్వం ఎక్కువ రోజులు మనలేదని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కడం చంద్రబాబు నైజమన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మామిడి కిలో రూ. 2 పలకడం తన జీవితంలో ఎప్పుడూ చూడలేదన్నారు. కర్ణాటక రాష్ట్రం కిలో రూ.16 మద్దతు ధరతో కేంద్ర ప్రభుత్వం లక్షలాది టన్నులు కొనుగోలు చేస్తుంటే, ఢిల్లీకి మంత్రిని పంపి, కిలోకు రూ.4 ధరతో రూ. 260 కోట్లు చాలని కోరడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రత విషయంలో ప్రభుత్వం వివక్ష చూపుతోందన్నారు.

### హామీల పేరుతో మోసం

జగన్ అమలు చేసిన సంక్షేమం కంటే మరింత ఎక్కువ చేస్తానని ప్రజలను మోసం చేసి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని వైఎస్సార్ సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు కరుణాకరరెడ్డి తెలిపారు. కూటమి పాలనలో అరాచకాలే మిగిలాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను జైళ్లకు పంపుతున్నారని, 680 మంది సోషియల్ మీడియా యాక్టివిస్టులపై తప్పుడు కేసులు పెట్టారని చెప్పారు. ప్రభుత్వం 2 వేల మంది పోలీసులు ఎంత ఇబ్బందులు పెట్టినా బంగారుపాళెంలో మామిడి రైతులు నిర్వహించింది కవాతు అని చెప్పారు. బంగారుపాళెం పర్యటన చూసి జిల్లాలో వైఎస్సార్‌సీపీ సత్తా ఏమిటో వారికి తెలిసివచ్చిందన్నారు. పార్టీ కార్యక్రమాలు చూసి వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. కొన్ని పచ్చ పత్రికలు ఏ రోజూ నిజం రాయవని, వైఎస్సార్‌సీపీపై నిందలు లేకుండా ఒక వార్తా రాయలేరని అన్నారు. బంగారుపాళెం పర్యటనను దండుపాళెం బ్యాచ్‌గా వర్ణించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు దండుపాళెం బ్యాచ్ అయితే టీడీపీ నాయకులు వారికి వేదపండితులు, మునులుగా కనిపిస్తున్నారా? అని ప్రశ్నించారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కొండవీటి నాగభూషణం, వెంకటరెడ్డి యాదవ్, పోకల అశోక్ కుమార్, ఫక్రుద్దీన్, చెంగారెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఆరోగ్య వివరాలు సేకరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో చిన్నారుల ఆరోగ్య వివరాలను పకడ్బందీగా సేకరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సూపర్‌వైజర్ 150 మంది పిల్లల బరువు వివరాలను సేకరించి రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. కచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు. గత వివరాలతో సరిపోల్చి పురోగతిని అంచనా వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పప్పు, పాల సరఫరాలో నాణ్యత తప్పనిసరిగా ఉండాలన్నారు. చిన్నారుల్లో ఆధార్ సమస్యలున్నట్లైతే సరిచేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆధార్ సమస్యలు ఎక్కువగా ఉన్న మండలాలను గుర్తించి, నివేదికలు అందజేయాలన్నారు. సూపర్‌వైజర్ నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. కుప్పంలో ఆరోగ్య, పోషణ స్క్రీనింగ్ నాణ్యతను పెంపొందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ భయపడదు


- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ కుమార్ ఆగ్రహం



మాట్లాడుతున్న డాక్టర్ సునీల్‌కుమార్, నాయకులు

బంగారుపాళెం: 'టీడీపీ ఉడత బెదిరింపులకు వైఎస్సార్‌సీపీ భయపడే ప్రసక్తేలేదు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి తమ కష్టాలను చెప్పుకునేందుకు వచ్చిన రైతులపై కూటమి సర్కారు పోలీసులతో లాఠీచార్జి చేయించడం దారుణం.' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన బంగారుపాళెంలో జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎంకు రైతులు కష్టాలు చెప్పుకోవడం తప్పా అని ప్రశ్నించారు. ఆంధ్రజ్యోతి పత్రికలో రైతులను దండుపాళెం బ్యాచ్‌తో పోల్చడం ఏమిటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులతో అనుచితంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. మీడియా ప్రజల పక్షాన నిలిచి, వారి సమస్యలను ప్రస్తావించాల్సింది పోయి ప్రభుత్వానికి కొమ్ముకాస్తోందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పర్యటనకు జనం కరువయ్యారంటూ మొదటి పేజీలో ఫొటో పెట్టారన్నారు. 13వ పేజీలో 10 వేల మంది జనం వచ్చారని రాసుకొచ్చారన్నారు. మరి 10 వేల మంది జనం ఫొటోను ఎందుకు పెట్టలేకపోయారని మండిపడ్డారు. జగన్ పర్యటనకు రానీయకుండా బంగారుపాళేనికి 30 కిలోమీటర్ల అవతల నుంచి ఆంక్షలు విధించి, బారికేడ్లు పెట్టి, బెదిరించి రానీయకుండా చూశారన్నారు. అవేవీ లెక్క చేయకుండా రైతులు, అభిమానులు బంగారుపాళేనికి తరలివచ్చారన్నారు. స్థానిక ఎమ్మెల్యేకి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి కాదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే, తానూ ఎమ్మెల్యేనే అంటూ సవాల్ చేయడం మంచిపద్ధతి కాదన్నారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎమ్మెల్యే జూస్ ఫ్యాక్టరీ యజమానుల వద్ద కమీషన్లు తీసుకుని రైతులకు అన్యాయం చేసి, వారి కడుపుకొట్టారని ఆరోపించారు. మామిడికి గిట్టుబాటు ధర రాక మామిడి చెట్లను నరికి వేస్తున్నారని, ఆ విషయం ప్రభుత్వం కళ్లకు కనిపించలేదా? అని మండిపడ్డారు. జగన్ పర్యటలో మద్యం, బిరియాని పంపిణీ చేశామని ప్రచారం చేస్తున్నారన్నారు. వారికి కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వలేదని చెప్పారు. దీనిపై సత్యప్రమాణం చేయగలరా? అని సవాలు విసిరారు. నాయకులకు నోటీసులు అందించి, కేసులు నమోదు చేస్తున్నారన్నారు. రైతులు ఆవేదన చెంది మామిడి కాయలను రోడ్డుపై పడేస్తే దానిపైనా టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. రైతులు, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తామన్నారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, మాజీ సర్పంచులు ప్రకాష్‌రెడ్డి, కృష్ణమూర్తి, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు గజేంద్ర, నాయకులు పరదేశి, మహేంద్ర, రఘుపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

### తానా కార్యదర్శిగా సునీల్ పాంత్ర



సునీల్‌పాంత్ర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) కార్యదర్శిగా జిల్లాకు చెందిన సునీల్ పాంత్ర ఎన్నికయ్యారు. తానా సంఘంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే పలు పదవులు అనుభవించారు. ఈ నేపథ్యంలో తానా కార్యదర్శిగా ఎంపికయ్యారు. కాగా ఆయన మన రాష్ట్రంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు.

### ఘనంగా సత్యనారాయణ వ్రతం



కాణిపాకం: గురుపౌర్ణమి సందర్భంగా కాణిపాకంలో సత్యనారాయణస్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీభూదేవి సమేత శ్రీవరదరాజులస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మూలవిరాట్‌కు విశేషాలంకరణ చేసి, అర్చన జరిపారు. అనంతరం సత్యనారాయణ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందుకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్ని వ్రతం ఆచరించి, తరించారు.

## ఆగని గజ దాడులు

పులిచెర్ల(కల్లూరు): పంట పొలాలపై ఏనుగుల దాడి ఆగడం లేదు. రోజూ ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉంది. మండలంలోని పాతపేట, చల్లావారిపల్లెల్లో గురువారం తెల్ల వారుజామున ఏనుగుల గుంపు మామిడి, టమాట, కొబ్బరి పంటలపై దాడి చేశాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లింది. పగటి పూట సమీపంలోని గోగుల వంకలో తిష్ట వేసిన ఏనుగులు రాత్రి పూట పొలాలపై దాడి చేస్తున్నాయి.

## పాల కాంట్రాక్ట్ రద్దు

సాక్షి టాస్క్‌ఫోర్స్: వినాయకస్వామి వారి అభిషేకానికి విరుగుడు పాలు సరఫరా చేసిన వ్యక్తి కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు వరసిద్ధివినాయకస్వామి ఆలయ ఈఓ పెంచల్‌కిషోర్ ప్రకటించారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయకస్వామివారికి నిత్యం పాలాభిషేకం చేస్తుంటారు. ఉదయం, సాయంత్రం అభిషేకాలు జరగ్గా.. రోజుకు సుమారు 100 లీటర్ల పాలు అవసరం అవుతాయి. ఒక్కొక్క అభిషేకానికి రెండు లీటర్ల పాలు అవసరం కాగా.. ఉదయం 25 మందికి, సాయంత్రం 25 మందికి చొప్పున్న పాలాభిషేకానికి అనుమతులుంటాయి. కౌంటర్ వద్ద 2 లీటర్ల పాల ధర రూ.200 చొప్పున్న విక్రయిస్తున్నారు. అభిషేకం టికెట్ పొందిన భక్తుల సౌకర్యార్థం కౌంటర్ వద్దే పాలు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు భక్తులు పాలాభిషేకం టికెట్ తీసుకుని 10 లీటర్ల పాలు కొనుగోలు చేశారు. ఆ పాలను పరిశీలించగా విరిగిపోయి ఉన్నట్లు గుర్తించిన వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. టెండర్‌దారుడితో వాగ్వివాదానికి దిగారు. దీనిపై ఆలయాధికారులు వెంటనే స్పందించారు. విరుగుడు పాలను గుర్తించి, మంచిపాలు ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అయితే అభిషేకానికి ఆ పాలు వాడలేదని అధికారులు, అర్చకులు స్పష్టం చేస్తున్నారు. స్వచ్ఛమైన ఆవు పాలను మాత్రమే అభిషేకానికి అనుమతించామన్నారు. ఏదీ ఏమైనా గురువారం ఆ కాంట్రాక్ట్‌ను రద్దు చేస్తున్నట్లు ఈఓ పెంచల కిషోర్ వెల్లడించారు. ఆలయం తరఫునే అభిషేకానికి ప్రస్తుతం పాలు అందిస్తున్నామన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చిన ప్రచారం అవాస్తమని ఆయన తెలిపారు.

## 18 నుంచి ఆడినెల ఉత్సవాలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు గుర్రప్ప నాయుడు వీధిలోని అంకాళపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 18వ తేదీ నుంచి ఆడి నెల ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకులు కుమార్ తెలిపారు. నాలుగు శుక్రవారాల పాటు అమ్మవారికి అలంకరణ, అభిషేకం, విశేష పూజలు జరుగుతాయన్నారు. 18న ఉదయం అభిషేక పూజలు, సాయంత్రం పుష్పాలంకరణ ఉంటుందన్నారు. 25న అభిషేకపూజలు, ప్రత్యేక పుష్పాలంకరణ, ఊరేగింపు, ఆగస్టు ఒకటో తేదీ ఉదయం అంబలి సమర్పణ, సాయంత్రం కుంభ సమర్పణ, ప్రత్యేక కుంకుమ అలంకరణ, 8న వరలక్ష్మీవ్రతం, గాజుల అలంకరణ, 15న అమ్మవారికి మహాభిషేకం, ప్రత్యేక అలంకరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



# వైద్యంపై నకిలీ పెత్తనం

జ్వరం.. దగ్గు.. ఆయాసం.. గుండెపోటు.. వ్యాధి ఏదైనా నయం కావాలంటే నాణ్యమైన వైద్యం అందాలి. అయితే నకిలీల వైద్యం రోగి బతుకులో విషం చిమ్ముతోంది. రోగిని అప్పులు పాలు చేయడమే కాకుండా అతడి ప్రాణాలను హరిస్తోంది. జిల్లాలో ఈ నకిలీల బెడదతో పలువురు నష్టపోయారు. అయినా ఏమాత్రం జంకు లేకుండా నకిలీ క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వైద్యంపై నకిలీలు పెత్తనం చెలాయిస్తున్నాయి.

- జిల్లాలో క్లినిక్‌ల పేరుతో నకిలీ దందా
- చిత్తూరులో కలకలం సృష్టిస్తున్న నకిలీ డాక్టర్ల వ్యవహారం
- అనుమతులు లేకుండా క్లినిక్‌ల నిర్వహణ
- ఇష్టారాజ్యంగా వైద్యం.. పెయిన్స్ కిల్లర్స్ వారి ఆయుధం
- తమిళనాడు, కర్ణాటక కేంద్రంగా జిల్లాలోకి నకిలీ వైద్యులు


ఇటీవల అధికారులు తనిఖీల్లో గుర్తించిన అక్రమ స్కానింగ్‌సెంటర్ (ఫైల్)

చిత్తూరురూరల్ (కాణిపాకం): జిల్లా నకిలీ వైద్యులు, అక్రమార్కులకు చిరునామాగా మారింది. జిల్లాలో గతంలో నకిలీ సర్టిఫికెట్లు, నకిలీ కరెన్సీ వెలుగుచూడగా, ఇటీవల కాలంలో నకిలీ వైద్యులు పట్టుబడుతున్నారు. ఫేక్ సర్టిఫికెట్లతో జనాన్ని బురిడీ కొట్టిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. తాజాగా రెండు రోజులకు కిందట ఓ డాక్టర్ నకిలీ కార్డియాలజిస్ట్ అన్న విషయం వెలుగుచూసింది. దీనికితోడు జిల్లాలో నకిలీ దందా యథేచ్ఛగా సాగుతోంది.

జిల్లాలో 900 క్లినిక్‌లు, 250 ఆస్పత్రులు, 20 పాలీక్లినిక్‌లు, 2వేల వరకు ఆర్ఎంపీ క్లినిక్‌లు ఉన్నాయి. ఇవన్నీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతులతో నడుస్తున్నాయి. అయితే అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌లు జిల్లాలో కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. ఒకదానికి కూడా రిజిస్ట్రేషన్ లేదు. ఇష్టానుసారంగా వైద్య కార్యకలపాలు నిర్వర్తిస్తున్నారు. చిత్తూరు పొన్నియమ్మ గుడివీధి, సుందరయ్యవీధి, చర్చివీధి, కొంగారెడ్డిపల్లి, పలమనేరు రోడ్డు. వన్‌డిపో రోడ్డు, మిట్టూరు, మురకంబట్టు, ప్రశాంత్‌నగర్, యాదమరి, పలమనేరు, కుప్పం, ఎస్ఆర్ పురం, నగరి తదితర ప్రాంతాల్లో ఈ నకిలీ క్లినిక్‌లు పుట్టగొడుగులా పుట్టుకొచ్చాయి.

**నకిలీ డాక్టర్లకు రూ.లక్షల్లో ఫీజులు**

జిల్లాలో కార్డియాలజిస్ట్ కొరత తీవ్రంగా వేధిస్తోంది. గుండె జబ్బు వస్తే తిరుపతి, తమిళనాడులోని వేలూరు, రాణిపేట, చెన్నై, కర్ణాటకలోని బెంగళూరును ఆశ్రయించాల్సి వస్తోంది. దీంతో నకిలీ డాక్టర్లు డిమాండ్ ఉన్న విభాగానికి డాక్టర్‌గా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రత్యక్షమవుతున్నారు. ప్రైవేటు క్లినిక్‌లను నడిపిస్తూ రూ.లక్షల్లో ఫీజులు తీసుకుంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే ఫీజుతో పాటు సకల వసతులు ఉండేలా చూసుకుంటున్నారు.

**వైద్యశాఖ అనుమతులు తప్పనిసరి**

ఎవరైనా వైద్యులు తమ వైద్యవృత్తిని నిర్వహించుకోవాలంటే ముందుగా డీఎంహెచ్‌ఓ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వైద్యకోర్సుకు సంబంధించిన సర్టిఫికెట్లను సమర్పించాలి. వైద్యాధికారులు సదరు సర్టిఫికెట్లను పరిశీలించిన తర్వాతే ఆస్పత్రి ఏర్పాటుకు అనుమతులు జారీ చేస్తారు. అలాగే ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెంబర్‌షిప్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎప్పటికప్పుడు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీలు చేయాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల జీవితాలతో నకిలీ వైద్యులు చెలగాటం ఆడుతుంటే.. ప్రభుత్వ వైద్యాధికారులు ఏం చేస్తున్నారనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. రాజకీయనాయకులు, అధికారుల పలుకుబడితో వైద్యవృత్తికి సంబంధం లేని వ్యక్తులు జిల్లా కేంద్రంలో ఆస్పత్రులను నిర్వహిస్తుండడం గమనార్హం. తక్కువ మొత్తంలో జీతాలకు నామమాత్రంగా వైద్యులను తీసుకువచ్చి ఆస్పత్రులను నడుపుతున్నారు. ఎలాంటి అర్హత లేని వారు వైద్యవృత్తిని కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

### ఇదిగో సాక్ష్యం..

- చిత్తూరు నగరంలోని భరత్‌నగర్‌లో కొన్ని రోజుల క్రితం ఒక వ్యక్తి తన ఇంట్లోనే లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జిల్లాలో సంచలనం రేపింది. ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యక్తులు స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి స్కానింగ్ చేసి, అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ విషయం కలెక్టర్ చెవిలో పడడంతో ఆయన నిఘా పెట్టి పట్టుకున్నారు. కేసు నమోదు చేయించారు. పట్టుబడిన వారిలో చిత్తూరు వాసులతో పాటు తమిళనాడు వాసులున్నారు.
- సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారం మేరకు చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్ డాక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిది గుంటూరు జిల్లా. ఇతడు కొన్నేళ్లుగా కార్డియాలజిస్ట్‌గా నమ్మిస్తున్నాడు. బాధితులు మాయగాడి అవతారాన్ని బహిర్గతం చేయడంతో నకిలీ వ్యవహారం బయటకు వచ్చింది. ఏడేళ్లకు క్రితం ఓ మీడియా కూడా కార్డియాలజిస్ట్ నకిలీ వ్యవహారాన్ని బయట పెట్టింది. కొన్నాళ్లు తలదాచుకున్న ఈ వ్యక్తి బెంగళూరు నుంచి చిత్తూరు నగరానికి వచ్చాడు. ఇక్కడ డాక్టర్‌గా నమ్మించాడు. తీరా గుట్టు బయటకు రావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడికి సర్టిఫికెట్ ఎలా వచ్చింది. మెడికల్ కౌన్సిల్‌లో ఎలా పేరు నమోదైందనే విషయంపై పలువురు వైద్య నిపుణులు అవాక్కవుతున్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లో రూ.2 స్టాంప్‌లా ఉంటుందని, ఆ స్టాంప్ నకిలీ డాక్టర్ ఇచ్చుకున్న సర్టిఫికెట్‌లో లేదని, ఇది దొంగ పత్రమేనని వారు స్పష్టం చేస్తున్నారు.

### డాక్టర్లు...డమ్మీ?

అనుమతులు లేని క్లినిక్‌ల విషయాన్ని పక్కన పెడితే.. డాక్టర్లు కూడా నకిలీలు తయారయ్యారు. దర్జాగా డాక్టర్లగా కొనసాగుతున్నారు. ఇష్టమొచ్చినట్లు చికిత్సలు చేస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొంతమంది డమ్మీ డాక్టర్లు ఏకంగా ప్రసవాలు, చిన్నపిల్లల వైద్య చికిత్సలు, దీర్ఘకాలిక వ్యాధులు, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు తదితర వాటికి చికిత్సలు చేస్తుండడంతో పాటు ఏకంగా సర్జరీలు చేస్తూ.. రూ.లక్షలు కాజేస్తున్నారు. రెగ్యులర్‌గా కొంత మందికి సలహాలు ఇస్తూ.. ఎంబీబీఎస్ డాక్టర్లుగా నమ్మిస్తున్నారు. వీరంతా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పుట్టుకొస్తున్నారు.

### కఠిన చర్యలు తీసుకుంటాం..



నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటాం. నకిలీ డాక్టర్లుగా రుజువైతే కేసులుంటాయి. అలాంటివి జిల్లాలో ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. డబ్బులు కోసం నకిలీ డాక్టర్లుగా అవతారమెత్తి..ప్రజల ఆరోగ్యాన్ని హరించకండి. ప్రజలు కూడా అవగాహన కలిగి ఉండాలి. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులను సంప్రదించాలి. లేకుంటే గుర్తింపు పొందిన ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాలి. నకిలీ డాక్టర్లను నమ్మొద్దు.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

## డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ**


విద్యార్థి తండ్రికి అవార్డు ప్రదానం చేస్తున్న ఎస్పీ

రొంపిచెర్ల: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ, ఎస్పీ మణికంఠ చందోలు సూచించారు. గురువారం రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడు తూ డ్రగ్స్ వాడకంతో విద్యార్థుల జీవితాలు నాశనం అవుతాయన్నారు. పిల్లల కదలికలపై తల్లిదండ్రుల నిఘా ఉంచాలన్నారు. ప్రతి రోజూ కొంత సేపు పిల్లలతో కలసి ఉండాలన్నారు. పిల్లలు ఏమి చేస్తున్నారో ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారా? లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. అలాగే పాఠశాలలకు పిల్లలు సక్రమంగా వెళ్లుతున్నారా? లేదా అని పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వం నెలకు ఒక విద్యార్థిపై రూ.5 వేలు ఖర్చు చేస్తుందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పిల్లలు విద్యార్థి దశలో సోషల్ మీడియా, సెల్‌ఫోన్లకు బానిసలవుతూ ఆట పాటలకు దూరం అవుతున్నా రని తెలిపారు. తల్లిదండ్రుల ఆశయాలను పిల్లలపై రుద్దడంతో వారు విజయాలు సాధించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. చదువుకోవడంలో పిల్లలకు తల్లిదండ్రులు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలన్నారు. అలాగే పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలన్నారు. అనంతరం పదో తరగతిలో ఉత్తమ మార్కు లు సాధించిన రిషిత, భరత్ కుమార్, వీణావాణికి షైనింగ్ అవార్డులు, సాధియా, రీద, గీతాశ్రీకి ఎన్ఎంఎంఎస్ అవార్డులను ప్రదానం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, ఎంఈఓ శ్రీనివాసులు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రెడ్డి ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక


పార్టీలో చేరిన ఎల్లప్పతో ఎమ్మెల్సీ భరత్, నాయకులు

శాంతిపురం: తెలుగుదేశం పార్టీ నాయకులు మోసం చేశారంటూ ఆ పార్టీకి చెందిన ఓ కార్యకర్త వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కర్లగట్ట పంచాయతీలోని తంబిగానిపల్లికి చెందిన ఎం.ఎల్లప్ప గురువారం కుప్పంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ ఆయనకు పార్టీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. తనకు మంచి పదవి ఇస్తామని 2019 ఎన్నికలకు ముందు తమ పంచాయతీలోని టీడీపీ నాయకులు పార్టీలోకి చేర్చుకున్నారని ఎల్లప్ప చెప్పారు. ఎన్నికల ప్రచారం కోసం తిప్పుకోవడంతోపాటు భారీగా ఖర్చులు పెట్టించారని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా తనకు పదవి ఇవ్వలేదన్నారు. పదవి ఇవ్వాలని, పక్కా ఇల్లు ఇవ్వాలని పదే పదే అడిగితే తనను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరానికి తనను వాడుకుని మోసం చేశారని అర్థం కావడంతో తాను ఆ పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు తెలిపారు. ఎలాంటి వివక్ష లేకుండా పాలన సాగించి, మాట తప్పని నేతగా నిలిచిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కర్లగట్ట ఎంపీటీసీ సభ్యుడు చలం, నాయకులు శ్రీనివాసులు, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

# ప్రచార ఆర్భాటం.. మెగా పీటీఎం

జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన మెగా పీటీఎం 2.0 సమావేశాలు కూటమి ప్రభుత్వం ప్రచారం కోసమే నిర్వహించినట్లు ఉందని విద్యావేత్తలు పెదవి విరిచారు. విద్యార్థులు పురోగతి, పాఠశాలల్లో నెలకొన్న సమస్యల నిమిత్తం నిర్వహించాల్సిన మెగా పీటీఎం సమావేశం ఉద్దేశాన్నే మార్చేశారన్నారు. విద్యావ్యవస్థలో కూటమి పార్టీ ప్రచారం కోసం మెగా పీటీఎం సమావేశాలను పావుగా వాడుకున్నారన్న విమర్శ వచ్చింది. సమావేశాలకు తల్లిదండ్రులు గైర్హాజరు కావడంతో ఏదో నిర్వహించామంటే... నిర్వహించామనే ధోరణిలో మెగా పీటీఎం సమావేశాలు జరిపి, చేతులు దులుపుకున్నారు.

- కూటమి ప్రచారం తప్ప ఒరిగిందేమి లేదు
- సమావేశంలో చర్చకు రాని విద్యార్థుల పురోగతి
- అధికంగా గైర్హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు
- ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో పేరు మార్చి సమావేశాలు


చౌడేపల్లి మండలం ఊటూరు ప్రాథమిక పాఠశాలలో ఉన్న నలుగురు విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 2,984 ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మెగా పీటీఎం సమావేశాల్లో కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప ఇంకేమి కనిపించని పరిస్థితి నెలకొంది. మెగా పీటీఎం సమావేశం ఉద్దేశాన్ని పూర్తిగా నీరుగార్చేశారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా జిల్లాలో విద్యాభివృద్ధికి చేసిందేమి లేదు. అభివృద్ధి దిశగా కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలల పేరుతో కిలోమీటర్ దూరంలో స్కూళ్లలో విలీనం చేసి విద్యార్థులకు నష్టం చేకూర్చారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారు వేల కోట్లు ఖర్చు చేసి అమలు చేస్తున్న నాడు-నేడు పనులను నిర్వీర్యం చేశారు. ఇవన్ని ప్రశ్నిస్తున్న తల్లిదండ్రులను ఏ మార్చేందుకు పబ్లిసిటీ స్టంట్ కోసం మెగా పీటీఎంలను నిర్వహించారనే విమర్శలు గుప్పుమంటున్నాయి.

**ఆటల పోటీలు తప్ప..సాగని చర్చలు**

జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మెగా పీటీఎం సమావేశాలు మొదలు పెట్టినప్పటి నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు ఆటల పోటీలు, డ్యాన్సులు చేయించారు. విద్యార్థులు విద్యలో ఎలా రాణిస్తున్నారు? ఏ సబ్జెక్టులో వెనుకబడి ఉన్నారు? వారి అభ్యున్నతికి చేపట్టే చర్యలేమిటి? పాఠశాల అభివృద్ధికి చేయాల్సిన పనులేమిటి? ఇలా పలు అంశాలపై చర్చలు జరపాల్సి ఉంటుంది. అయితే ఈ దిశగా చర్చలేమి మెగా పీటీఎం సమావేశాల్లో జరగని పరిస్థితి కనిపించింది. ఈ సమావేశాలకు కూటమి ఎమ్మెల్యేలు హాజరై గొప్పలు చేసేశామనే ధోరణిలో ప్రసంగాలు చేసి వెళ్లి పోయారు. దాదాపు 90 శాతం పైగా పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చాలా వరకు పాఠశాలల్లో విద్యార్థుల పురోగతిని తెలిపే హోలిస్టిక్ ప్రోగ్రాస్ కార్డులను సైతం ఇవ్వని పరిస్థితి నెలకొంది.

**అధికంగా గైర్హాజరు**

జిల్లాలోని 2,984 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. అయితే వీటిలో 20 శాతం ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం జాడే కనిపించని పరిస్థితులు నెలకున్నాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా మెగా పీటీఎం సమావేశాలకు 2,60,641 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరుకావాల్సి ఉంది. అయితే ఈ సమావేశానికి 2,894 మంది తల్లిదండ్రులు మాత్రం హాజరైనట్లు విద్యాశాఖ నివేదికలు పేర్కొన్నాయి. వీటిని చూస్తే అర్థం చేసుకోవచ్చు ఈ సమావేశాల నిర్వహణ తీరు ఎలా సాగిందన్న విషయం. కాగా కూటమి ప్రభుత్వంలో రెండో విడత ఈ సమావేశాలు నిర్వహించారు. గతంలో మొదటి సారి నిర్వహించిన ఈ సమావేశాల్లో చర్చించిన సమస్యలేవి పరిష్కారం కాలేదని తల్లిదండ్రులు పెదవి విరిచారు. ఈ సమావేశాల వల్ల ఒరిగిందేమి లేదని తల్లిదండ్రులు విమర్శలు గుప్పించారు.

**ప్రైవేట్, కార్పొరేట్‌లో ఇష్టానుసారం**

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో మెగా పీటీఎం 2.0 సమావేశాలను ఇష్టానుసారంగా నిర్వహించారు. నిబంధనల ప్రకారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. అయితే మధ్యాహ్నం వరకు కొన్ని పాఠశాలల్లో.. మరి కొన్ని పాఠశాలల్లో 11.30 గంటలకే ముగించేశారు. అలాగే కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలను భేఖాతర్ చేశారు. జిల్లాలోని నారాయణ, శ్రీచైతన్య పాఠశాలల్లో మెగా పీటీఎం అని కాకుండా పేర్లు మార్చి సమావేశాలు నిర్వహించి మమ అనిపించేశారు.

### జిల్లాలో మెగా పీటీఎం 2.0 నిర్వహణ సమాచారం

| | |
|---|---|
| జిల్లాలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలలు : | 2,984 |
| సమావేశాలకు రిజిస్టర్ చేసుకోని పాఠశాలలు : | 6 |
| హాజరైన తల్లులు : | 1,731 |
| హాజరైన తండ్రులు : | 1,112 |
| హాజరైన సంరక్షకులు : | 51 |
| మొత్తం విద్యార్థులు : | 2,60,641 |
| హాజరైన విద్యార్థులు : | 2,07,621 |
| గైర్హాజరైన విద్యార్థులు : | 53,020 |

### కొన్ని ఉదాహరణలు ఇలా..

- చిత్తూరు సంతపేటలోని పీఎన్‌సీ మున్సిపల్ పాఠశాలలో మొత్తం 409 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కొందరు తల్లిదండ్రులు కేంద్రీయ విద్యాలయ హామీ ఏమైంది సార్ అని ప్రశ్నించారు. ఇందుకు ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి అంటూనే చివర్లో చిన్న సమస్యతో పెండింగ్ పడింది. త్వరలోనే కేంద్రీయ విద్యాలయ హామీ నెరవేరుతుందన్నారు. 409 మంది తల్లిదండ్రులు హాజరుకావాల్సి ఉండగా 150 మంది విద్యార్థులు మాత్రం సమావేశానికి హాజరయ్యారు.
- పుంగనూరు నియోజకవర్గంలోని చౌడేపల్లి మండలం ఊటూరు ప్రాథమిక పాఠశాలలో నలుగురే విద్యార్థులున్నారు. ఆ నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులు అర్ధగంట పాటు ఉండి వెళ్లిపోయారు.
- నగరి నియోజకవర్గంలోని నగరి మండలం ఎం.కొత్తూరు జెడ్పీ హైస్కూల్‌లో 226 మంది విద్యార్థులుంటే 36 మంది తల్లిదండ్రులు మాత్రమే హాజరయ్యారు.
- నగరి నియోజకవర్గంలోని చింతలపట్టెడ వినాయకపురం జెడ్పీ హైస్కూల్‌లో 175 మంది విద్యార్థులకుగాను ఐదుగురు తల్లులు మాత్రమే మెగా పీటీఎం సమావేశానికి హాజరయ్యారు. ఇదే పరిస్థితి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నెలకొంది.



## మధ్యవర్తిత్వంపై ముగిసిన శిక్షణ


ప్రసంగిస్తున్న ఉమ్మడి జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి భారతి

తిరుపతి లీగల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 48 మంది న్యాయవాదులు, సంఘ సేవకులకు మధ్యవర్తిత్వం, ఇతర అంశాలపై గురువారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ, మధ్యవర్తిత్వ కేంద్రం ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాల్లో ఈ శిక్షణ తరగతులను నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి భారతి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఢిల్లీకి చెందిన న్యాయవాది, సీనియర్ ట్రైనర్ అనూజ సక్సేన, మధ్యప్రదేశ్‌కు చెందిన న్యాయవాది, సంఘ సేవకురాలు నీనా కరే మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించారు. శిక్షణ ముగింపు సందర్భంగా జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి భారతి ఇద్దరు న్యాయవాదులను సన్మానించారు.

## జగన్ పర్యటన సక్సెస్


మాట్లాడుతున్న కృష్ణారెడ్డి, ప్రకాష్, బాబునాయుడు

చిత్తూరు కార్పొరేషన్: పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతమైందని వైఎస్సార్ సీపీ రైతు నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ రైతు విభాగం చిత్తూరు నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గుడిపాల మండల అధ్యక్షుడు ప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు బాబునాయుడు, ఎఫ్ఎఫ్ఏ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, సర్పంచ్ మధుసూదన్‌రాయల్ మాట్లాడారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే వారికి మద్దతుగా జగనన్న బంగారుపాళెం పర్యటనకు వచ్చారన్నారు. జగనన్న పర్యటన కార్యక్రమాన్ని ప్రకటించిన తరువాత ప్రభుత్వానికి రైతులపై హఠాత్తుగా ప్రేమ వచ్చిదన్నారు. అకస్మాతుగా వారితో అధికారులు సమావేశాలు పెట్టి హడావుడి చేశారన్నారు. జగనన్న పర్యటనకు 500 మందికి మాత్రమే పోలీసులు అనుమతులు ఇచ్చామన్నారు. కానీ ఎందుకు 2 వేల మందికి పైగా పోలీసులు పెట్టి అడుగడుగున అడ్డంకులు సృష్టించారని ప్రశ్నించారు. ఎంత ప్రయత్నం చేసి అధినేతపై రైతులకు ఉండే ఆదరణ, అభిమానాన్ని అపలేకపోయారన్నారు. కొండలు, గుట్టలు దాటుకుని మార్కెట్‌యార్డుకు వేలాది మంది వచ్చారన్నారు. పర్యటనను ఫ్లాప్ చేయాలని పోలీసులు దౌర్జన్యంగా లాఠీచార్జీ చేసి, రైతులను కొట్టారన్నారు.


**రైతులను దండుపాళ్యం బ్యాచ్ అంటారా?**

వేలాది మంది రైతులు రావడం చూసి ఓర్వలేని ఆంధ్రజ్యోతి పత్రికలో రైతులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను దండుపాళ్యం బ్యాచ్‌తో పోలుస్తూ వార్తలు రాయడం సరికాదన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు వేలాది టోకెన్లు అక్రమంగా తీసుకున్నారన్నారు. వారు చెప్పిన వారికి మాత్రమే ఫ్యాక్టరీల్లో త్వరగా పంటను దింపుకున్నరన్నారు. పొరుగు రాష్ట్రం కర్ణాటకలో రూ.16 ఇస్తున్నారని చెప్పారు. విజనరీ సీఎంగా గొప్పలు చెప్పుకునే చంద్రబాబు కిలో మామిడి రూ.8 కూడా ఎందుకు కొనుగోలు చేయలేకపోతున్నరని ప్రశ్నించారు.

**రైతులంటే ప్రేమ లేదు**

చంద్రబాబుకు రైతులంటే ఎప్పుడు ప్రేమ లేదని గ్రీనరి బ్యూటిఫికేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, సర్పంచ్ అమరనాథ్‌రెడ్డి, ఏకాంబరం, నాయకులు రవీంద్రరెడ్డి విమర్శించారు. 1996లో బషీర్‌బాగ్‌లో రైతులు ధర్నా చేస్తుంటే వారిపై కాల్పులు జరిపిన ఘనత బాబుదన్నారు. తర్వాత వారి కుటుంబాలకు సైతం పరిహారం ఇవ్వలేదన్నారు. మంత్రి అచ్చెనాయుడు చిత్తూరుకు వచ్చి పల్ప్ ఫ్యాక్టరీ యజమానులతో సమావేశం నిర్వహించిన తరువాత వారి పరిస్థితి ఇంకా దారుణంగా మారిందన్నారు.

## శాకాంబరీ పాహిమాం!


శాకంబరిని కూరగాయలతో అలంకరించిన దృశ్యం

కాణిపాకం: శాకాంబరీ పాహిమాం అంటూ భక్తులు అమ్మవార్లకు ప్రణమిల్లారు. వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైనా మణికంఠేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఆషాడ పౌర్ణమి పూజ లు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం మరగదాంబిక, దుర్గాదేవి అమ్మవార్లను శాకాంబరిగా అలంకరించారు. ఈఓ పెంచలకిషోర్, ఏఈఓ రవీంద్రబాబు పాల్గొన్నారు.

**20 టన్నుల కూరగాయలతో అలంకరణ**

ఆషాడ పౌర్ణమి పూజలను పురస్కరించుకుని పలమనేరు, కర్ణాటక రాష్ట్రం వడ్డిపల్లి, కోలారు, ముల్బాగల్, బెంగళూరు, తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు మార్కెట్ యాజమాన్యం వారు ఉచితంగా 20 టన్నుల కూరగాయలను ఆలయానికి అందజేశారు. వీటితో ఆలయాలను అలంకరించారు. ప్రధాన దేవాలయ ధ్వజస్తంభం, అర్ధమండపం, అంతరాలయాన్ని పలు రకాల కూరగాయలతో అలంకరించారు. ఆలయమంతా తోరణం కట్టారు. కూరగాయలతో అమ్మవారి ముఖచిత్రాన్ని తీర్చిదిద్దారు.